సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



సిరులతల్లీ.. ప్రణామం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, సిరులతల్లి కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. IIలో



పోలీసులకు సీపీ అభినందన

నేషనల్ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించినందుకు అధికారులు, సిబ్బందిని సీపీ రవిశంకర్ అభినందించారు. IIలో



వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. IIలో

ఉలిక్కిపడిన నగరం

- ఇండస్ హాస్పటల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం
- ఎటువంటి నష్టం లేకుండా చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం
- పేషెంట్లను వేర్వేరు ఆసుపత్రులకు తరలించిన ఇండస్ సిబ్బంది
- దాదాపు 3 గంటల పాటు శ్రమించిన అగ్నిమాపక, పోలీస్ యంత్రాంగం



సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది



ఆస్పత్రి సిబ్బంది, రోగులను వేరే ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు, వారి కుటుంబ సభ్యులు



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్



పొగ ధాటికి ఉక్కిరి బిక్కిరి అయిన ఓటీ సిబ్బందిని వేరే ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



రోదిస్తున్న ఆస్పత్రి సిబ్బంది



సిబ్బందిని కిందకు దించుతున్న అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ టీం



ఆస్పత్రి అద్దాలను పగలుకొడుతున్న సిబ్బంది



మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

దాబాగార్డెన్స్: గురువారం ఉదయం 11.30 గంటలు. నిత్యం రద్దీగా ఉండే జగదాంబ జంక్షన్. అక్కడికి కూతవేటు దూరంలో ఓ ఆసుపత్రి నుంచి పెద్ద ఎత్తున పొగలు. కొనుగోలుదారులు, వాహనచోదకులు, పరిసర ప్రాంతాల్లో గల ఆసుపత్రి సిబ్బంది మంటలు, పొగలు చూసి బెంబేలెత్తారు. అగ్నిమాపక యంత్రాలు పెద్ద ఎత్తున వస్తుండడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆసుపత్రిలో ఏమి జరిగిందో? లోపల ఎంత మంది పేషెంట్లు ఉండిపోయారని ఆందోళన చెందారు.

ఏం జరిగిందంటే..

జగదాంబ జంక్షన్ సమీపంలో లేపాక్షి ఎంపోరియంకు ఎదురుగా గల ఇండస్ హాస్పటల్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఉదయం 11.30 గంటలకు షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా ఆపరేషన్ థియేటర్‌లో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ సెకండ్ ఫ్లోర్‌లో గల అన్ని రూమ్‌లకు వ్యాపించింది. ఆ ఫ్లోర్‌లోని పలు రూమ్‌ల్లో చికిత్స పొందుతున్న పేషెంట్లతో పాటు ఆపరేషన్ గదిలో ఉన్న సిబ్బంది పొగతో ఉక్కిరిబిక్కిరయ్యారు.

హ్యాట్సాఫ్ సిబ్బంది

మంటలు, పొగ పెద్ద ఎత్తున వ్యాపిస్తుండడంతో ఆసుపత్రి సిబ్బంది సెకండ్ ఫ్లోర్ పలు గదుల్లో చికిత్స పొందుతున్న పేషెంట్లను ఎత్తుకుంటూ సమీపంలో గల మెడికవర్, విజేత ఆసుపత్రులకు తరలించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టారు.

పెద్ద ఎత్తున అగ్నిమాపక యంత్రాలు

సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 10 ఫైరింజన్లతో ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. మంటలు, పొగ వ్యాపించకుండా పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. వివిధ గదుల్లో ఉండిపోయిన పేషెంట్లను చాకచక్యంగా బయటకు తీసుకొచ్చారు. సెకండ్ ఫ్లోర్ మొత్తం పొగతో నిండిపోవడంతో అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను కూడా లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

పోలీస్ సేవలు భేష్

సంఘటన జరిగిన ప్రాంతానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ హుటాహుటిన చేరుకున్నారు. రక్షణ చర్యలను పరిశీలించారు. వివిధ శాఖలను అప్రమత్తం చేశారు. రద్దీ ప్రాంతం కావడంతో ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారు. ఆసుపత్రికి అన్ని వైపులా, బహుళ అంతస్తులో జరుగుతున్న సహాయక చర్యలు పర్యవేక్షించారు. వివిధ ఆసుపత్రుల్లో చేర్పించిన పేషెంట్ల పరిస్థితిపై ఆరా తీశారు. స్వయంగా పేషెంట్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. సహాయక చర్యల్లో సీపీతో పాటు డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, ఫైర్ అధికారులు, సిబ్బంది, నగర ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైమ్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఎస్డీఆర్ఎఫ్ బృందం పాల్గొంది.

వివిధ ఆసుపత్రుల్లో చికిత్స..

అగ్నిప్రమాదం సంభవించిన నేపథ్యంలో ఇండస్‌లో చికిత్స పొందుతున్న 47 మంది పేషెంట్లను సమీపంలో గల ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. 30 మందిని విజేత, 17 మందిని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఉక్కిరి బిక్కిరయ్యాను..



పక్షవాతంతో ఇండస్ ఆసుపత్రిలో చేరాను. ఉదయం 11.30 గంటలకు నేను చికిత్స పొందుతున్న గదిలోకి పొగవస్తుందని సిబ్బంది తలుపులు వేశారు. అయినప్పటికీ గదిలోకి పెద్ద ఎత్తున పొగ వస్తుండడంతో కొంత ఉక్కిరి బిక్కిరి అయ్యాను. వాంతు కూడా అయింది. ఇంతలో ఆసుపత్రి సిబ్బంది గది తలుపులు తీసేసి తనను కిందకు తీసుకొచ్చి పక్కనున్న ఆసుపత్రిలో చేర్పించారు.

– వెంకటరమణారెడ్డి, ఎక్స్ ఆర్మీ

నడుం సమస్యతో చేరా..



ఇటీవల పడిపోవడంతో నడుం దెబ్బతింది. బంధువులు, కుటుంబ సభ్యులు ఇండస్ ఆసుపత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతున్నాను. శుక్రవారం ఉదయం ఉన్నట్టుండి గదిలోకి దట్టమైన పొగ రావడంతో భయపడ్డాను. వెంటనే నన్ను ఇక్కడి సిబ్బంది పక్కనున్నఆసుపత్రికి తీసుకొచ్చారు.

– బి.రాంబాబు, రోగి

నిన్ననే ఆసుపత్రిలో చేరా..



ఏడాది కిందట గుండెకి సంబంధించిన శస్త్ర చికిత్స చేశారు. మళ్లీ హోల్ మూసిందని చెప్పారు. నిన్ననే ఆసుపత్రిలో చేరాను. ఉదయం దట్టమైన పొగ రావడంతో ఆందోళన చెందాను. సిబ్బంది వచ్చి పక్కనున్న ఆస్పత్రికి తరలించారు.

– సరస్వతి, కంచరపాలెం

స్టంట్స్ వేస్తామన్నారు..



గుండె సమస్య వల్ల ఆసుపత్రిలో చూపించాను. స్టంట్స్ వేయాలన్నారు. ఈ నెల 12న అడ్మిట్ అయ్యాను. స్టంట్స్ వేస్తారన్న సమయంలో ఈ ఘటన జరిగింది. దట్టమైన పొగతో చాలా ఇబ్బంది పడ్డాను.

– పి.బ్రహ్మానందం, నాతయ్యపాలెం

ఏడుగుర్ని దింపాను..



సెకండ్ ఫ్లోర్‌లో వివిధ గదుల్లో చికిత్స పొందుతున్న ఏడుగురిని కిందకు దింపాను. అందులో ఓ గర్భిణీ కూడా ఉన్నారు. మిగిలిన వారంతా వృద్ధులే. స్ట్రక్చర్‌పై ఉన్న పేషెంట్‌ను కూడా దించాను. నేను లోపలకు వెళ్లేసరికి గదులన్నీ పొగతో నిండి ఉన్నాయి. రోగులు భయాందోళనలో ఉన్నారు. వారికి ధైర్యం చెప్పాను.

– పి.రవికుమార్, అగ్నిమాపక సిబ్బంది



ఆందోళనలో ఇండస్ ఆస్పత్రి సిబ్బంది

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్

గోపాలపట్నం: శ్రీకాకుళం జిల్లాలో పర్యటన నిమిత్తం గురువారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన ఆయన 9.13 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ జి.సుభద్ర, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డీసీపీ ఆనంద్ రెడ్డి తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీఎంతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని విశాఖ వచ్చారు. ఇక్కడి నుంచి 9.27 గంటలకు సీఎం జగన్ హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరారు. ఆయన వెంట మంత్రులు బూడి ముత్యాలనాయుడు, విడదల రజని ఉన్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 5.13 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడ నుంచి 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు. ఆయన వెంట పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.



సీఎంకు మొక్క అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గురువులు, చిత్రంలో ఎంపీ ఎంవీవీ

అన్ని ఆస్పత్రులను తనిఖీ చేయండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: ఇండస్ ఆస్పత్రిని గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందని ఆస్పత్రి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి మొదటి అంతస్తులోని లాపరోస్కోపిక్ ఆపరేషన్ థియేటర్‌లోని ఎలక్ట్రికల్ ప్యానల్ బాక్స్ వద్ద సుమారు 11.20 గంటల ప్రాంతంలో పొగలు చిమ్మి అగ్ని ప్రమాదం సంభవించిందని, అప్పుడే ఓ ఆపరేషన్ పూర్తి చేసి వచ్చానని గ్యాస్ట్రో ఎంట్రాలజీ సర్జన్ డాక్టర్ ఎస్ శ్రీధర్ కమిషనర్‌కు వివరించారు. ఒక రోజు ముందే ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. పొగలు ఎక్కువగా రావడం, వెంటిలేషన్ లేకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందని, అయినప్పటికీ 45 నిమిషాల్లోనే సత్వర చర్యలు తీసుకున్నామని జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్య, రీజినల్ ఫైర్ ఆఫీసర్ హనుమంతరావు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో వెంటిలేషన్‌కు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో అన్ని ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, హోటళ్లు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తనిఖీ చేసి నివేదిక అందజేయాలని రీజినల్ ఫైర్ ఆఫీసర్‌ను ఆదేశించారు. జీవీఎంసీ కార్యనిర్వహణాధికారి పీవీవీ సత్యనారాయణరాజు, ఈఈ సంతోషి, ఏసీపీ వినయ్‌ప్రసాద్, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో 61 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా రూ.49.98 లక్షలతో 34వ వార్డు కొబ్బరితోట కల్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణం, 84వ వార్డు అనకాపల్లిలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారి జంక్షన్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఎడమ వైపు ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగింపు, 81వ వార్డు మరిడిమాంబ ఆలయం నుంచి ఇందిరమ్మ కాలనీ సీసీ రోడ్డు నిర్మాణం, జోన్–3 పరిధి 23వ వార్డు రాజరాజేశ్వరి ఆలయం నుంచి గాయత్రీ పాఠశాల వరకు, చైతన్యనగర్, మద్దిలపాలెంలో రూ.48.50 లక్షలతో బీటీ రోడ్ల పునరుద్ధరణ, జోన్–6 పరిధి 77వ వార్డులో నమ్మిదొడ్డి ప్రధాన రహదారి బీటీ రోడ్డు వెడల్పు, రాజీవ్‌నగర్ బీటీ రోడ్డు వెడల్పు, మిగిలిన చేపలపాలెం వంతెన పనులు పూర్తి, జోన్–1 పరిధి ఒకటో వార్డులో చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డు నుంచి కొండపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వరకు రూ.39.40 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం తదితర అంశాలపై చర్చ జరగనుంది. నగర పరిధిలో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపిస్తున్న దృష్ట్యా.. స్లం లెవల్ ఫెడరేషన్ ప్రక్రియ ద్వారా అదనపు సిబ్బందితో వెక్టర్ కంట్రోల్ కార్యక్రమాలు చేపట్టే అంశంపై చర్చించనున్నారు.

న్యూస్‌రీల్

విజిలెన్స్ డీఎస్పీగా తాతారావు బాధ్యతల స్వీకరణ



ఎంవీపీకాలనీ: విశాఖపట్నం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా ఎస్. తాతారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1996లో ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది విశాఖ సిటీ, రూరల్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సేవలు అందించారు. కె.కోటపాడు సీఐగా పనిచేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందారు.

ఏయూలో ఎంఏ పాళి, బుద్ధిస్ట్ స్టడీస్ కోర్సులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలో ఎం.ఏ పాళి, బుద్ధిస్ట్ స్టడీస్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ శ్రీలంకలోని జయవర్ధనపుర విశ్వవిద్యాలయంతో సంయుక్తంగా తొలిసారిగా ఈ కోర్సును అందిస్తోందని పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సును ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని తెలియజేశారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో చేరవచ్చని, ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వార్షిక ఫీజుగా రూ.19,500 చెల్లించాలని తెలియజేశారు. ఇతర వివరాలకు 97013 42985 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ పొదుపు చేస్తే ఉత్పత్తి చేసినట్లే..

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్, డైరెక్టర్లు రమేష్ ప్రసాద్, చంద్రం, సూర్యప్రతాప్

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే.. రెండు యూనిట్లను ఉత్పత్తి చేసిన వారమవుతామన్నారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని విద్యుత్ పొదుపునకు సంబంధించిన బ్యానర్లు, కరపత్రాలు, వాల్ పోస్టర్లను సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపును తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో ఈ నెల 20 వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు, కళా ప్రదర్శనలు, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, కళాశాల విద్యార్థులకు సదస్సులు నిర్వహించాలని సర్కిల్ ఎస్ఈలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏవీవీ సూర్య ప్రతాప్, సీజీఎంలు సింహాద్రి, ఎస్.మసిలామణి, అచ్చి రవికుమార్, డి.సుమన్ కల్యాణి, ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

లక్ష దాటిన 'ఆడుదాం ఆంధ్ర' రిజిస్ట్రేషన్లు

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌కు జిల్లా నుంచి 1,08,064 మంది నమోదు చేసుకున్నారు. మరింత మంది ఆటగాళ్ల నమోదుకు అవకాశం ఇవ్వాలని కోరవడంతో జిల్లా యంత్రాంగం మరో రెండు రోజుల పాటు పొడిగించింది. ఆటగాళ్లు తమ పేర్లను https:// aadudamandhra.ap.gov.inలో నమోదు చేసుకోవచ్చు. కాగా.. జిల్లా నుంచి పురుషులు 77,746, మహిళలు 30,318 మంది నమోదు చేసుకున్నారు. అత్యధికంగా క్రికెట్‌లో 43,654 మంది పురుషులు, 3,186 మంది మహిళలు, బ్యాడ్మింటన్‌లో 7,627 మంది పురుషులు, 4,514 మంది మహిళలు, వాలీబాల్‌లో 11,399 మంది పురుషులు, 2,206 మంది మహిళలు నమోదు చేసుకున్నారు. ఇక కబడ్డీలో 10,973 మంది పురుషులు, 7,256 మంది మహిళలు, ఖోఖోలో 4,093 మంది పురుషులు, అత్యధికంగా 13,156 మంది మహిళలు నమోదు చేసుకోవడం విశేషం. వీరంతా ఆయా గ్రామ/వార్డు తరఫున జట్లుగా తొలి దశలో పోటీపడనున్నారు. ప్రదర్శన అంశాల్లోనూ 21,410 మంది పురుషులు, 16,032 మంది మహిళలు సిద్ధమవుతున్నారు.

ఉత్సాహంగా ట్రయల్ మ్యాచ్

ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో భాగంగా వాలీబాల్ ట్రయల్ మ్యాచ్‌ను శుక్రవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవి హాజరై టాస్ వేసి పోటీ ప్రారంభించారు. ఆరోగ్య పరిరక్షణకు ఆటలు ఆడటం మంచిదని.. అందరూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనాలన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ జూన్ గాలియట్ పర్యవేక్షించారు.

సేంద్రియ ఆహారం.. నేటి ఆరోగ్య మంత్రం

- ప్రారంభమైన విశాఖ ఆర్గానిక్ మేళా
- ఆర్గానిక్ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెరిగింది: జీవీఎంసీ కమిషనర్



ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు



మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్



మొక్కల స్టాల్‌ను తిలకిస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరగాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న విశాఖ ఆర్గానిక్ మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను సందర్శించి, రైతులు పండించిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన పెరుగుతోందన్నారు. విశాఖను ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దడానికి ఇటువంటి మేళాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు.

సేంద్రియ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని.. తద్వారా రైతులకు మేలు చేయాలని విశాఖ వాసులకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు మధ్య అనుసంధానంగా విశాఖ ఆర్గానిక్ మేళా నిలుస్తుందన్నారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి, గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ రాజు, రాష్ట్ర నాయకుడు పి.ఎల్.ఎన్ రాజు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణారావు, విద్యా భారతి జాతీయ అధ్యక్షుడు దూసి రామకృష్ణ మూర్తి, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్, గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, మేళా ప్రతినిధులు సాయిబాబు, సత్య మధుసూదనరెడ్డి, అవని ఆర్గానిక్స్ ఉషా గజపతి రాజు, సిటీ టెర్రస్ గార్డెన్ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లె.. పిలుపు..



ఆవుకి అరటిపండు తినిపిస్తున్న కమిషనర్

విశాఖ ఆర్గానిక్ మేళా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని గ్రామీణ వాతావరణం ఉట్టిపడే విధంగా తీర్చిదిద్దారు. రైతులు, గుడిసెలు, దేశీ, పుంగనూరు గోవులతో పల్లె సందడి నెలకొంది. విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పదార్థాలను స్టాళ్లలో విక్రయించారు. తృణ ధాన్యాలు, ఎర్రబియ్యం, నల్లబియ్యం, దంపుడు బియ్యం, దేశీ ఆవు నెయ్యి, కూరగాయల విత్తనాలు, పూల అలంకరణ మొక్కలు, టెర్రస్ గార్డెనింగ్‌కు ఉపయుక్తంగా నిలిచే ఉపకరణాలను విరివిరిగా అమ్మకాలు చేపట్టారు. మట్టి, ఇనుముతో చేసిన పాత్రలు, మిరప, టమాటా నారు, కూరగాయల విత్తనాలు, అరకు తేనె, కొబ్బరి పాలు, గానుగ నూనెలు, సేంద్రియ బెల్లం, వర్జిన్ కోకోనట్ ఆయిల్ వంటివి అందుబాటులో ఉంచారు. ఈ మేళా మరో మూడు రోజుల పాటు కొనసాగనుంది.

శ్రీవారి సన్నిధిలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయం, క్యూలైన్లు, ప్రసాద వితరణ, శానిటేషన్, పార్కింగ్ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి శ్రీవారికి ప్రీతికరమైన శనివారం రావడంతో వేల సంఖ్యలో భక్తులు దర్శించుకునే అవకాశం ఉంటుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఆలయ ఇన్‌స్పెక్టర్లు శివ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

5 గంటల నుంచి దర్శనాలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని 23న శనివారం వేకువజామున 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకూ నైవేద్యం బ్రేక్, 12.30 గంటల నుంచి 6 వరకు దర్శనాలు కల్పిస్తామన్నారు. మరలా 6 గంటల నుంచి 6.30 వరకు బ్రేక్ ఉంటుందని, 6.30 గంటల నుంచి రాత్రి 10 వరకు శ్రీవారి దర్శనాలు కల్పించనున్నామని తెలిపారు. అనంతరం శ్రీవారికి ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిరులతల్లీ.. ప్రణామం

- వైభవంగా మార్గశిర మాసం మొదటి గురువారం పూజలు
- కనకమహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- అర్ధరాత్రి తొలి దర్శనంతో పులకించిన భక్త జనం


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, సిరులతల్లి కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణాలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం, విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి, పసుపు పూశారు. అనంతరం అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి, బుధవారం అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వెండి కవచాలు తొడిగారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి తొలి దర్శనం చేసుకుని భక్త జనం పులకించిపోయింది. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు బోదిలపాటి సత్యరూపవాణి, మళ్ల ధనలత, బుద్దల అనురాధ, బెహర వెంకటరత్నం, సత్యవరపు సతీష్, వంకాయల మారుతీప్రసాద్, నండూరి సత్య శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం, సానబోయిన సురేష్, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్.వెంకటరమణ, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సహాయ ఇంజినీర్ కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

దర్శన క్యూలైన్లు ఇలా..

టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనం, రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500 మార్గశిర విశిష్ట దర్శనం కల్పించారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం కార్యాలయం ఎదురుగా దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఘోషాస్పత్రి వద్ద అగ్నిమాపక యంత్రం, రీడింగ్ రూమ్ వద్ద మొబైల్ టాయిలెట్‌ను అందుబాటులో ఉంచారు. అమ్మవారి ఆలయం సమీపంలో పోలీస్ అవుట్ పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందజేశారు. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాసుపత్రి, అమ్మవారి ఆలయ వెనుక భాగంలో చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

3 వేల మందికి అన్నదానం

టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

నేటి కార్యక్రమాలు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చన జరగనుంది. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించనున్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


ఉచిత బస్ సర్వీస్ ప్రారంభిస్తున్న ఈవో శిరీష

ఉచిత బస్సు సర్వీసులు

భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి రెండు ఉచిత బస్సు సర్వీసులు నడిపినట్టు ఆలయ ఈవో తెలిపారు.


అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

అమెరికన్లకు స్వరూపానందేంద్ర ఆశీస్సులు


అమెరికన్‌ను ఆశీర్వదిస్తున్న స్వామీజీ

పెందుర్తి: హిందూత్వం పట్ల ఆకర్షితులైన పలువురు అమెరికన్లు గురువారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించి, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. ఆయుర్వేద వైద్య విధానంపై అధ్యయనం చేసేందుకు అమెరికాకు చెందిన డాక్టర్ నికోల్ ఆధ్వర్యంలో వీరంతా విశాఖకు వచ్చారు. చింతలూరు ఆయుర్వేద వైద్యం నిలయం వైద్యులు కాశీ విశ్వనాథ తేజస్వి వద్ద శిక్షణ తీసుకుంటూ మెలకువలను నేర్చుకుంటున్నారు. ఈ క్రమంలో స్వామీజీని కలిసిన వారు సనాతన ధర్మం విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. వారిలో జూలీ, టానా అనే యువతులు మాతంగి, పద్మాక్షి అని పేర్లు మార్చుకున్నారు. మైఖేల్ అనే అమెరికన్ తన చేతిపై దేవతామూర్తి చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకుని హిందూ ధర్మంపై అభిమానాన్ని చాటుకున్నాడు. వీరంతా హిందూధర్మంపై కనబరుస్తున్న ఆసక్తిని చూసిన స్వామీజీ ఆనందం వ్యక్తం చేశారు. పీఠం దుశ్శాలువాతో సత్కరించారు.

సుజుకి శాటిలైట్ ఔట్‌లెట్ ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న సుజికి జోనల్ మేనేజర్ ప్రమోద్‌కుమార్

మల్కాపురం: సుజుకి శాటిలైట్ ఔట్‌లెట్ ద్విచక్ర వాహనాలను మల్కాపురంలో అగ్రశ్రేణి డీలర్ పద్మజ ద్వారా అందించనున్నారు. మల్కాపురంలో ఏర్పాటు చేసిన షోరూంను గురువారం సుజుకి జోనల్ మేనేజర్(సేల్స్) ప్రమోద్‌కుమార్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి సుజుకి వారి శాటిలైట్ ఔట్‌లెట్ షోరూంను ఇక్కడ ప్రారంభించామన్నారు. అధునాతన సౌకర్యాలు, కస్టమర్లకు వంద శాతం సంతృప్తి పొందేలా సుజుకి వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి సుజుకి వాహనం కొనుగోలుదారుడికి ఒక ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మజ సుజుకి జీఎం ఎస్.కె.రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

19 ఆటోలపై కేసుల నమోదు

గోపాలపట్నం: మధురవాడ, వేపగుంట తదితర ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి.. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న 19 ఆటోలు, ఒక స్కూల్ బస్‌పై కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. మరో నాలుగు ఆటోలను సీజ్ చేశామన్నారు. ఈ నెల 11 నుంచి చేపట్టిన తనిఖీల్లో 55 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో అధికారులు ప్రవీణ్ కుమార్, మన్మోహన్, సుమన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు మాక్ డ్రిల్


అమృతపురంలో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో పాల్గొన్న గెయిల్, హెచ్‌పీసీఎల్ సిబ్బంది

సబ్బవరం: భూగర్భ గ్యాస్ పైప్‌లైన్, ఆయిల్ వల్ల జరిగే ప్రమాదాల నివారణకు ఉమ్మడి విశాఖ ప్రాంతాల్లో గెయిల్ ఇండియా, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. మండలంలోని అమృతపురం సమీపంలో గెయిల్, హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొని పైప్‌లైన్ ద్వారా వెలువడే గ్యాస్, ఆయిల్ లీకేజీలకు తెలుసుకొని అప్రమత్తమయ్యే విధానాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. లీకేజీ విషయంపై సంబంధిత స్టేషన్ సిబ్బంది అప్రమత్తమై ఉన్నతాధాకారుల దృష్టికి తీసుకువెళ్లగా హుటాహుటిన అధికారులు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని గ్యాస్ లీక్ అరికట్టే విధానం ఆసక్తి గొలిపింది. అనంతరం జరిగిన సమావేశంలో గెయిల్ సీజీఎం ఎల్ఎస్ రావు మాట్లాడుతూ విశాఖ నుంచి సికింద్రాబాద్ వరకూ భూగర్భం ద్వారా వెళ్లే గ్యాస్ పైప్‌లైన్ ప్రమాదాలకు గురికాకుండా 37 ప్రాంతాల్లో ఎస్‌వీ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 12 నుంచి 15 కిలోమీటర్లలోపు ఒక ఎస్‌వీ స్టేషన్ ఏర్పాటు చేసి అందులో నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించామన్నారు. ఈ సందర్భంగా గెయిల్, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయం ప్రారంభం



లబ్ధిదారురాలికి నమూనా ఇంటి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: పరవాడ సమీపం గొర్లివానిపాలెం వద్ద రూ.35.85 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించిన 512 టిడ్కో గృహ సముదాయాన్ని గురువారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. టిడ్కో గృహ సముదాయంలో 430 ఎస్ఎఫ్‌టీలో 160 మందికి, 365 ఎస్ఎఫ్‌టీలో 32 మంది, 300 ఎస్ఎఫ్‌టీలో 320 మంది లబ్ధిదారులకు గృహ వసతి కల్పించినట్లు చెప్పారు. ఒక్క రూపాయి రిజిస్ట్రేషన్‌తో లక్షల విలువైన సొంతింటి కలను నిజం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస రావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, జెడ్పీ పి.సింహచలం తదితరులు పాల్గొన్నారు.

బ్రాండెడ్ స్టిక్కర్లు అతికించి దుస్తుల విక్రయం

- ఇద్దరిపై కేసు నమోదు
- 544 షర్టులు, 266 టీ షర్టుల స్వాధీనం

సీతమ్మధార: తక్కువ ధర ఉన్న దుస్తులపై బ్రాండెడ్ కంపెనీల స్టిక్కర్లు అతికించి విక్రయిస్తున్న ఇద్దరిపై ఫోర్తుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి ఆలయం పక్కన 16 టూ 61 మెన్స్‌వేర్ షాపు ఉంది. ఇక్కడ తక్కువ ధర ఉన్న టీ షర్ట్స్, షర్టులపై పలు బ్రాండెడ్ కంపెనీలకు సంబంధించిన స్టిక్కర్లు వేసి విక్రయిస్తున్నట్లు ఓ కంపెనీకి చెందిన ప్రతినిధి సయ్యద్ అహ్మద్ ఫరూక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ ఎస్.విజయకుమార్ గురువారం షాపు తనిఖీ చేసి.. 544 షర్టులు, 266 టీ షర్టులను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానులు మద్దాల సురేష్, మద్దాల రామారావులపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

వెస్ట్ సబ్ డివిజన్ పోలీసులకు సీపీ అభినందనలు

అల్లిపురం: ఈ నెల 9న జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించినందుకు అధికారులను, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో 78 శాతం కేసులు పరిష్కరించినందుకు, సబ్ డివిజన్‌లో మొదటి స్థానంలో వెస్ట్ సబ్‌డివిజన్ నిలిచి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు శాంతిభద్రతల డీసీపీ-2 ఆనందరెడ్డి, వెస్ట్ ఏసీపీ నరసింహమూర్తి, గాజువాక సీఐ, ఎస్ఐలకు సీపీ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,890
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,650
వెండి(కిలో):	రూ.79,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	రూ.115
ఫారం	రూ.95
స్కిన్	రూ.200
స్కిన్‌లెస్	రూ.210

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	585.00
విజయనగరం	589.00
శ్రీకాకుళం	589.00

తండ్రి రుణం తీర్చుకుంది..


తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నవ్య

కశింకోట: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది. కశింకోటలోని గవరపేటలో ఈ ఘటన జరిగింది. భూముల కొనుగోలు, అమ్మకాల్లో మధ్యవర్తిత్వంతో జీవనం సాగిస్తున్న వేగి వెంకటరావు (60) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కుమారులు లేరు. నవ్య, మంజు అనే ఇద్దరు కుమార్తెలు, భార్య సత్యవతి ఉన్నారు. పెద్ద కుమార్తె నవ్య తండ్రికి స్థానిక సాధుమఠం శ్మశాన వాటికలో తలకొరివి పెట్టి అంతిమ సంస్కారం జరిపింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి తండ్రికి అంతిమ వీడ్కోలు పలికింది.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు


హాకీ పోటీలు ప్రారంభిస్తున్న కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ


హోరాహోరీగా జరుగుతున్న హాకీ పోటీలు

- నక్కపల్లిలో ఉత్సాహంగా ప్రారంభం
- 600 మంది క్రీడాకారుల హాజరు

నక్కపల్లి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నక్కపల్లిలో అండర్ -19 విభాగంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. బాలురకు హాకీ క్రీడా మైదానంలోను, బాలికలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోను పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బోదిగల్లం రోడ్డులోని హెటెరో హాకీ క్రీడా ప్రాంగణంలో ముందుగా జాతీయ జెండాను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వీసం రామకృష్ణ ఆవిష్కరించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రాధాన్యమిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలను ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభిస్తుందన్నారు. నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు కృషితో నక్కపల్లికి దేశవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. గత నెలలో ఇక్కడ అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. మళ్లీ ఇక్కడే పోటీలు జరగడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నారన్నారు.

ఉద్యోగాలతోపాటు, స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు పొందడం అభినందనీయమన్నారు. ఇక్కడ క్రీడాకారుల ప్రతిభను దృష్టిలో ఉంచుకుని హెటెరో యాజమాన్యం పంచాయతీ వారి సహకారంతో సువిశాలమైన క్రీడా ప్రాంగణం సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, సర్పంచ్ నేతల జయరత్నకుమారి, ఎంపీటీసీ గొర్ల దుర్గాగోవిందు, ఇంటర్ బోర్డు అధికారి బీ సుజాత, హాకీ టోర్నమెంట్ పరిశీలకుడు సుధీర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషశైలజ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంబాబు, బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు, వార్డు సభ్యుడు కే నానాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా తొలి రోజు పోటీలు

తొలి రోజు పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో విజయనగరం - ప్రకాశం జిల్లా జట్లు తలపడ్డాయి. ప్రకాశం జట్టు విజయం సాధించింది. పశ్చిమ గోదావరిపై చిత్తూరు, శ్రీకాకుళంపై అనంతపురం జట్లు విజయం సాధించాయి. కర్నూలు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య, తూర్పుగోదావరి - గుంటూరు మధ్య పోటీలు 2-2తో డ్రాగా ముగిశాయి. అనంతపురం - విశాఖపట్నం మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. బాలికల విభాగంలో అనంతపురంపై చిత్తూరు విజయం సాధించింది.